# జయ జయవంతి!


[జ్ఞాపకాలు ఏకాంతస్థలంలో భవనాలవంటివి. వాటిని తెరచే తాళం చెవులు వర్తమానంలో లభ్యమైన అనుభూతుల గుత్తులలో ఇమిడి ఉంటాయి ఒక మంచిదృశ్యం చూచినా, ఒక మంచి సంగీతం విన్నా దాని వెనుక ఎన్నడో జరిగిన అనుభూతి ఒక జలపాతంలాగా ఉప్పొంగి వస్తుంది. ఈ సంగతే కాళిదాసుమహాకవి – 'రమ్యాణి వీక్ష్య' అని ప్రారంభించి – 'పర్యుత్సుకో భవతి జననాంతర సౌహృదాని' అని చెప్పాడు. జననాంతరం కాకపోయినా, ఈ జన్మలోనే గతించిపోయిన అనుభూతులు వానితోపాటు చెరగని జ్ఞాపకాలు జీవితంలో విడిచిపోతూఉంటాయి. అవి తిరిగి మధురస్మృతులుగా గుర్తించడానికి ప్రస్తుతం మన పంచేంద్రియాల ద్వారా అనుభవించే ఆనందం ఒక సాధన కావచ్చు. అలాంటి జ్ఞాపకాలు, ఒకోసారి సుందరదృశ్యాలుగా ఎదురవుతాయి. మరొకసారి గప్పున ఎగసి వచ్చే పరిమళాల పొట్లాలులాగ విప్పగానే వింతగా హృదయాన్ని ముంచి యెత్తుతాయి. ఇంకొకసారి ఒక సంగీతరచనలాగున మనస్సును ఆహ్లాదంతో ఓలలాడించి, ఊహించరాని స్వప్నలోకాలలోనికి తీసికొనిపోతాయి. ఆ సుఖంలో చెప్పరాని దుఃఖం, ఇదియని పైకి నిర్వచింపరాని మధురజ్వాల!]

**11** గంటలైంది. అదిగో రేడియోలో సన్నగా చల్లగా రాగాలాపన వినిపిస్తోంది. అప్సరస్సుందరుల మృదుల స్పర్శతో అదృశ్యహస్తాలు నిమురుతూవున్నట్లు; ప్రాణాలు ఎక్కడికో ఎగిరిపోతున్నట్లు – ఎంత మధురబాధ! బాధా విరహాతను మౌనరాగాలతో వినిపించే వైష్ణవి కీర్తనలాగున – ఎలాంటి ఆక్రందన, ఎలాంటి ఆమోదము – ఆ రాగం జయజయవంతి – ఆ మధుర స్వరాలు తీరని కోరికలుగా చేతులు సాచుకొని ఉరకలువేస్తున్న మనోరథాల మంజుల పథాలు; విరబూసిన వెన్నెలలు; విరహిణీ మనోవ్యథలు; ఆ సంగీతం గంగాప్రవంతిలాగ వెల్లువలు కట్టి వస్తుంటే దానితోపాటు ఎన్నో సుందర దృశ్యాలు రూపుకట్టి జరిగిపోతున్నవి. దివ్య మందిరాలు, సుందర విగ్రహాలు, సుమనోహర ప్రకృతి చిత్రాలు, నదులు, కొండలు, ఆశ్రమాలు, భక్తులు, ఆరాధనలు, నీరాజనలు, ఇలాంటి వెన్నో. ఒక్కొక్క చిత్రంలో నా మనస్సు

"శ్రీవాత్సవ"

అరూపస్వరూపంలో. కనిపిస్తున్నది. ఒక్కొక్క స్వరంలో అణగిన ఆత్మ వాంఛ అభిమతాలు వ్యక్తపరచుకొంటున్నది. జయజయవంతి ఎంత అందమైన రాగం – ఈ ఆలాపన, తానం, ద్రుతగతి స్వరాలు వింటూఉంటే ఎందుకు నా కీ ఆందోళన – దీని అంతకీ ఒక కథ ఉంది. అది కల్పనకాదు – నిజమైన జీవితానుభూతి – ఈ తాళంచెవి తెరుస్తే నిర్జనవనంలోని ఆ సుందర భవనం ప్రత్యక్ష మవుతుంది. అక్కడికి భూత కాలంలోని అనుభూతుల దేవకన్యలు వచ్చి నృత్యం చేస్తారు. రండి చూద్దాం – ఆ నందనవనంలోకి, ఆ సుందర సీమలోనికి

కాశీయాత్రకని నేను, నా సుమంగళి, చిన్నపాప వెళ్ళాం. కారణం మా యత్తగారి యాత్రాదర్శన కుతూహలము. ఆమె, ఇహ లోకంనుండి చివరిపీడుకోలు తీసికునేముందు కాశీలో మూడురాత్రులు గడిపి అవలీలగా పుణ్యం కట్టుకోవాలని కోరిక. తన కూతురు ఢిల్లీలో ఉండటంవల్ల, ఢిల్లీకి ఎలాగూ వచ్చింది కనుక, ఢిల్లీకీ కాశీకీ ఎంతో దూరం లేదుకనుక అది సాధ్యమయింది. ఆమె వచ్చిన మరునాడునుండీ ప్రయాణము – చంటిపాప అంత బలంగాలేదు. అయినా ప్రయాణం తప్పలేదు. ఎలాగో ఒక సుప్రభాతాన కాశీలో వచ్చిపడ్డాం. వచ్చినప్పటినుండీ అక్కడి పండితులు మా వంశవృక్షాలు చదివి, మా పూర్వ చరిత్ర అంతా ఏకరువు పెట్టారు. మేము యాత్రకోసం రాలేదు మహాత్మా, ఏదో పనివుండి వచ్చామంటే వినిపించుకోరు. ఎలాగో ఆ పురోహితుల్నీ, అనుక్షణం వేధించే కోతుల్నీ తప్పించుకొని, ప్రస్తుతము హోటలుగా ఉపయోగిస్తున్న ధర్మశాలలో పడ్డాం. అందులో మాకిచ్చిన గది, గాలి వెలుతురు వంటి పంచభూతాల మీద పంతం బట్టి, వాటికి దేవుడే కల్పన చేసిన అంతఃపురం. అసలే బడలికగా వున్న మాకు అక్కడ క్షణంకూడ యుగంగా గడిచింది. పాప ఒక్కసారి తన అసమ్మతిని ప్రకటించడానికి ఉచ్చస్వరంతో రాగం మొదలు పెట్టింది. అత్తగారు పాపను భుజంమీద వేసుకొన్నారు. మా ఆవిడ సామాన్లు సరిది, గదిలోని ధూళితో గంధపుపూత ప్రారంభించింది. నే నీలోపున ధర్మశాల ప్రదక్షిణం చేసి అన్నీ చూచివస్తున్నాను. ఇంతలో గంగాస్నానం వేళ అయిందని ధర్మశాలలో 'గైడు' హెచ్చరిక చేశాడు. అంతా కలిసి దశాశ్వమేధ ఘట్టంలోకి వెళ్లాం. అక్కడ స్నానాలు, పురోహితులు, పురాణాలు, నావలు, నావలలో పరదాగదులు చిత్రవిచిత్రంగా కనిపిస్తున్నాయి. పవిత్రమైన గంగామాయి మాత్రం ఇంతమంది యాత్రీకుల పాపాన్ని కడుపులో పెట్టుకొని ఎప్పటిలాగ చిరునవ్వుతో సాగిపోతు





న్నది, అందులో మునిగివచ్చి, నీళ్లు కారుతూన్న శిరోజాలతో యాత్రికులు ఆ గంగామాతకు కృతజ్ఞతలు తెలిపి, ప్రక్షాళన పొందిన పాపాలకు సంతసించి క్రొత్తపాపాలు చేయడానికి 'లైసెన్సు' దొరికినంత ఆనందంతో ఒడ్డుమీద నున్న వేలకొద్దీ శివలింగాలకు అభిషేకం చేస్తున్నారు. తరువాత విశ్వేశ్వరాలయం, విశాలాక్షి మందిరం, కాలభైరవుడి గుడి—యిలాగ యెన్నెన్నో – ఇవన్నీ చూచి వచ్చేటప్పటికి మధ్యాహ్నం తిరిగింది – ఆవేళ మా కందరికీ ఉపవాసమే. ఎక్కడయినా కదళీఫలాలు దొరికితే వాటితో తృప్తిపడ్డాం. పాపవంకపెట్టి. ఆ పిల్లకు పాలు సంపాదించినపుడు మేముకూడా ఒక గ్రుక్కెడు పాల నీళ్ళతో కంఠాలు తడుపుకున్నాం.

తిరిగి నగర సంకర్షణం. ఎక్కడెక్కడికో ఆ యెక్కామీద యెక్కి తిరుగుతూఉంటే, శరీర మంతా కండించిపోయింది. బొందితో కైలాసం వెళ్ళడ మంటే ఇదే అనిపించింది. గంగానది లోని వివిధఘట్టాలూ చూస్తున్నాం – మణికర్ణికా ఘట్టం, హరిశ్చంద్ర ఘట్టం, అస్సీఘాట్. ఇవన్నీ కలిసిన పుణ్యక్షేత్రం వారణాసి – ఇంత కోలాహలంలో, ఇంత కశ్మలంలో, ఇంత దుర్గంధంలో, ఇంత పాపపంకిలంలో విశ్వేశ్వరుని విభూతిలాగ ఏదో పవిత్రత, ఏదో నిర్మలత అగ్నిదగ్ధ భస్మపుండ్రమువలె అగోచరంగా అనుభూతికి వస్తున్నది. అదేనేమో మా జన్మాంతర సంస్కారం – ఈ మలినంలోని నిర్మలత్వాన్ని అందుకొనేటట్లు చేసింది. ఈ

నగరంలో ముఖ్యఘట్టాలు చుట్టబెట్టి, మా ధర్మశాల చేరుకున్నాం. అప్పటికే నిద్రాదేవి మా కన్నులలో తాండవిస్తున్నది. గది చేరగానే, శ్రీమతీ, అత్తగారూ తలవాల్చడానికి బిశానా పరుస్తున్నారు. పాపకు ఆ చోటు నచ్చలేదు. క(య్‌)మని తన నిరసన తెలియజేసింది. ఆ భవనానికి మూడు అంతస్థులు. అన్నిటి చుట్టూ కిటకిటలాడుతూ జనం – ఎక్కడా చీమ దూరడానికికూడ చోటు లేదు. మూడు అంతస్థులూ దాటి నాలుగో అంతస్థులో పెద్ద విశాలమైన డాబా. ఈ చివరనుండి ఆ చివరవరకు గచ్చు – నాలుగు మూలలా నాలుగు చిన్న గోపురాలు. ఒకమూల పాప, ఆమె తల్లి, ఆమె తల్లికితల్లి మేనువాల్చి పడుకున్నారు. వెంటనే వారిని నిద్రాదేవి ఆదరించింది. నేను మిగిలిపోయాను. బడలికచేత ఒళ్లు వెచ్చగా వుంది. క్రింద వీధులలోని కోలాహలం వయిదాకా రావడం లేదు. దూరంగా గంటలనినాదం ఏ పురాతన శివాలయంలో నుండో చల్లగా వినిపిస్తూఉంది. నేను డాబా చివరికి వచ్చి క్రిందకి చూస్తున్నాను. దూరంగా గంగాస్రవంతి నీరసంగా ప్రవహిస్తూఉన్నది. ఫాల్గుణ పూర్ణిమ నిశి దాటిన రెండవనాడు – వెన్నెల వింతగా రంగులు మారుతూ విరహిణీ హృదయంలాగ వేదన అనుభవిస్తూ ఉన్నది. రాత్రి 11 గంటలు. దూరంగా శహానాయ్ చల్లగా ప్రారంభమయింది. రాగం ఆలాపన – ముందు విలంబ కాలంలో పోల్చుకొన్నాను – జయజయవంతి రాగం – ఎంత మనోజ్ఞంగా ఉంది. ఎన్నో జన్మాంతరాల సౌహృదం నా హృదయంలో పొంగి పారుతూఉన్నది; శహానాయ్ పలుకుతూనేఉన్నది – బృందావనంలో గోపికలను ముగ్ధుల్ని చేసిన వంశీమోహనుని మురళి యిలాగ ఉండేదేమో! నిద్రిస్తున్న ఆత్మలను మేల్కొలుప జాలే యోగిపుంగవుల భద్రవాణి యిలాగ పలుకుతుందేమో!

అదే – గంగానదీ తరంగాలలో చెంగలించే అమృతలహరిగా – మరుపురాని వెన్నెల తారలుగా, మౌన మధుర స్వరమాలికగా ప్రవహిస్తున్నది. నా కన్నులు చెమ్మగిల్లాయి. అలాగ ఎంతసేపు నిలువబడివున్నానో! గంట గడిచిపోయిందేమో – అదే రాగం – అదే స్వరాలు – మరింత దురితంగా, మరింత మధురంగా – ఎవరో పిలుస్తున్నట్లు, ఎక్కడికో ప్రయాణమై పోతూ ఉన్నట్లు. కాళ్లు కదలవు; హృదయము పరుగు లెత్తుతోంది; ఎక్కడికో శరీరం ఎగిరిపోతూఉంది. ఆపుకోలేని ఆవేదన, కన్నుల నిండిన అశ్రుమాల, ఏదో ఆక్రందన శరీరం అంతటినీ కంపింప చేస్తున్నది. ఇంతలో కన్నులు తెరచి చూశాను. ఎదురుగా మరొక వ్యక్తి. ఆమె సుందరి, రూపసి; నందనవాసిని.





మందమృదులహాసిని. ఊర్వశియేమో అనిపించింది. ఆ రాగస్వరాలు నాలో కలిగించిన అనుభూతియే ఆమెలో కలిగించి వుండవచ్చును. వీనులు వింటున్నవి; కనులు కంటున్నవి; హృదయము కంపిస్తున్నది. మహాప్రళయములో కంపించిపోతున్న మెరుపుతీగలాగ ఆమె కనిపించింది. ఆమెలోని అనుభూతి, నాలో సింపతిటిక్ మువ్‌మెంట్స్ కలిగించినట్లయింది. దురితగతిలో 'తాన్'స్వరాలు పలుకుతున్నాయి. ఏవో వెన్నెల చినుకులు రాగాలుగా క్రుమ్మరిస్తున్నట్లు, నక్షత్రాలు రాలిపడుతున్నట్లు, విద్యుల్లతలు వేగంగా సాగిపోయినట్లు — ఆ సంగీత వర్షంలో మునిగి — నిశ్శబ్దంగా నిలిచియున్నాము — ఇద్దరు వ్యక్తులము మాటలాడుకో లేదు. ఎవరు ఎవరో తెలియదు. ఆమె ఎవరో, నే నెవరినో — ఒక ఆపదలో, ఒక ఆనందంలో సన్నిహితమైన రెండు ఆత్మలులాగున ఎంతో చేరువై పోయాం. సంగీతం ముగిసింది; ఒక ఆనందంతో పాటు ఆందోళన వెల్లివిరిసింది. అక్కడ గోపురాల వెనుక తొంగిచూచే చందమామలాగున ఆమెకూడ మందహాసంతో నిలిచింది. ఒక విచిత్ర దృశ్యకావ్యం చూచిన తరువాత, ఆనందముగ్ధులయిన సహృదయులాలాగున, ఎవరికివారము తిరిగి వెళ్ళిపోయాము — ఆ జయజయవంతి రాగంమాత్రం నా రక్తనాళాలలో, హృదయ స్పందనంలో పొంగులు వారుతున్నది. తిరిగి ఆ రాగం విన్నప్పుడల్లా అదే అనుభూతి, అదే ఆవేదన.

కాశీనుండి మేము హరిద్వారం వెళ్ళాము. ఉన్నగా దక్షిణాదివారి ధర్మశాలకు వెళ్ళాము. చంద్రకాంత శిలలతో నిర్మించిన ఆ సౌధము ధర్మశాలలాగు లేదు; ఒక రాజరాజు విడిచిపెట్టిన విడిది గృహంలా గుంది. వెళ్ళగానే మాకు గది దొరికింది; పాత్రలు, సదుపాయాలు. అక్కడ వెనుక పాలరాతి మెట్లమీద నుండి గంగానది ప్రవహిస్తున్నది. వేసవిలోకూడ మంచులాంటి చల్లని జల స్పర్శ క్రొత్త శక్తిని సమకూర్చు తుంది. ఆ వేగానికి తట్టుకోలేక కొట్టుకుని పోవచ్చునని, ఆ స్నానఘట్టంలో వెండిగొలుసులు వేశారు; వాటిని వ్రేలాడుతూ స్నానం చేయవచ్చును.

హరికేపూల్ వైపుకి మేము బయలు దేరాము. మాకు ఎదురయ్యా రొక కుటుంబం – ఒక యువతి, ఒక వృద్ధ, ఒక పడుచువాడు; చంటిపిల్లలు లేరు. బసకోసం ఎంతగానో వెదకులాడారట – లభించలేదు. మా ధర్మశాల గుమాస్తాను వచ్చి బస యిమ్మని అడుగుతున్నారు. ఇక్కడ దక్షిణాదివారికేకాని ఇతరులకి ఇవ్వరు అయితే మద్రాసీలు సిఫారసు చేసి, ధ్రువపత్రం వ్రాస్తే ఇతరులకి ఇస్తారు. ఆ పడుచువాడు నన్ను బ్రతిమాలాడు — నేను అలాగే అని పత్రం మీద సంతకం పెట్టి సిఫారసు చేశాను. గుమాస్తా వారి కొక గది యిచ్చాడు. వారు గుజరాతీవారు. సౌరాష్ట్ర ప్రాంతం నుండి యాత్రకు వచ్చారు. వారిలోని ఆమె మేలిముసుగు తొలగించింది. ఆశ్చర్యం–ఆ క్రితం రాత్రి కాశీలోని ధర్మశాలలో అర్ధరాత్రివేళ ఆ సౌధోపరి భాగంపైన జయజయవంతి రాగ సముద్రంలో సరిగంగస్నానం చేసిన ఆ సుదరి – చిరునవ్వుతో మెరసిన కృతజ్ఞత ఆ కన్నులలో ప్రకాశించింది. మౌనసంగీతం వెల్లివిరిసింది. మేము హరికేపూల్ వద్దకు వెళ్ళి, స్నానం చేసి, సంధ్యాహారతి సమయంలో గంగా పూజ చేసి, దీపికలు వెలిగించాము. హరిద్వారంలో ముఖ్యస్థలాలు చూచి, అక్కడనుండి ఋషీకేశ్ బయలుదేరి వెళ్ళిపోయాము.

అక్కడ ఆంధ్రాశ్రమంలో విడిసి, దర్శనం చేసికొని లక్ష్మణఝూలాకు స్వర్గాశ్రమానికి పోవాలని వెళ్తున్నాం. కాలికమలియా ధర్మశాలలో తిరిగి ఆ సుందరి, వెనువెంట ఆ వృద్ధ మరొక యువకుడు అక్కడ నమస్తే చెప్పారు. ఒకరిని ఒకరం కుశల ప్రశ్నలు వేసినతర్వాత హరిద్వారంలో నేను చేసినదానికి ఆయన ధన్యవాదాలు చెప్పాడు.

లక్ష్మణఝూలాకు బస్సులో ప్రయాణము చేసినతరువాత లక్ష్మణమందిర్ వద్ద నిలిపివేశారు. అక్కడ మాకు భోజనాలు లేవు. ప్రొద్దు పైకి ఎగబ్రాకింది. కాలినడకను ఆ వంతెనమీద నడచి




వెళ్తూవుంటే, ఉయ్యాల లూపినట్లయింది. క్రిందుగా – ఎన్నో తాళ్ళ ప్రమాణాల లోతులో గంగ తురంగలిస్తూ ప్రవహిస్తున్నది. ఇంత ప్రశాంత వాతావరణంలో మౌనంగా ఆ సంగీతం వినిపించినట్లు అనుభూతి – జయజయవంతి రాగములో ద్రుత తాన్ స్వరాలు– ముందుకి సాగిపోయాం. అక్కడ అవతలిఒడ్డున స్వర్గాశ్రమం పోవడానికి నాలుగైదు మైళ్ళు నడచిపోవాలి. కాని త్రోవలో భరత్‌పూర్ స్టేట్‌వారో, ఆల్వార్ స్టేట్ వారో కట్టించిన కృష్ణమందిరం ఉన్నది.

అక్కడ ఆగి దర్శనం చేసుకోవాలని కుతూహలం. దిగువ గంగానదిలో స్నానం చేయడానికి నేనొక్కడినే దిగి రెండు మునుగులు మునిగాను. ఆప్తమిత్రుని స్నేహంలాగున ఎంత చల్లదనం! ఎంత ప్రాణప్రదము! చాల చీడీలు ఎక్కడం దిగడం కష్టం – నా భార్యకాని, అత్తగారుకాని దిగలేదు– ప్రక్కనే మరొకరు ఆ శీతలజలాలలో మునకలు వేశారు. తిరిగి ఆ సుందరి మేలిముసుగు తడిసింది. ఆ బంగారు వన్నె శరీరంమీద జలధారలు ప్రవహిస్తూ ఉంటే రాగస్వరాలు పిలికలై పడుతున్నట్లనిపించింది. తిరిగి మౌనంగానే మేము పలుకరించుకొన్నాం. ఏదో ఆనందము, చెప్పరాని ఆవేదన.

పైకి ఎక్కివచ్చిన తరువాత - దేవాలయంలో కృష్ణవిగ్రహం ముందు నిలిచాము నాలుగువైపుల పవిత్రమైన పరిమళాలు-పుష్పాలు - ధూపదీప గంధాలు - మనస్సు ఏదో విచిత్రానుభూతిలో తన్మయమైపోయింది ఆ బాలమురళీకృష్ణుని విగ్రహంలోని పాలరాతి నున్నదనంలో సౌందర్యము లాస్యరూపాన చిందులు త్రొక్కుతున్నది. ప్రేమ లహరులుగా ఆ మురళీ మౌననినాదంలో వెల్లివిరుస్తున్నది ఎంత తీయనిబాధ - ఆ భువనమోహన మందహాసంలో రాగస్వరాలు పొంగిపొరలిపోతున్నవి అదే సంగీతం, అదే రాగం - జయజయవంతి

అష్టోత్తర నామావళి - పూర్తిచేసి అర్చకుడు - పంచామృత పాత్రతో ఆలయగర్భంలో నుంచున్నాడు పసుపు బట్టలతో మూర్తీభవించిన విద్యాదేవి లాగ ప్రకాశిస్తున్నాడు. శ్రీ పాదములు శిరస్సుపై ధరించి, తీర్థం తీసుకుంటున్నాను నా ప్రక్క పెద్దపెద్ద కళ్ళు విప్పి ప్రార్థిస్తున్నట్లు పలుకరిస్తున్నాయి. తీర్థం ఇస్తున్నపూజారి చిరునవ్వు ఆమె దోసిలిలో వేశాడు. ఆమె 'పురుషెడు' పట్టి పరమప్రసాదంగా స్వీకరించింది రెండు కళ్ళు మెరసాయి. మరి రెండు కనులు ప్రకాశించాయి. నాలుగు కనులు మౌనసందేశాలకు మాటలాడుకున్నాయి. అవి కల్యాణాల స్వరాలు లేని రాగాలాపనలు.

స్వర్గాశ్రమపథంలో పడి ముందుకి సాగిపోతున్నాము అన్నివైపులా చల్లని గాలిలో పులకించే పుష్పభామినుల సౌగంధ పరిష్వంగాలు నా భుజముపైన పసిపాప యేడ్చియేడ్చి నిదురపోయింది వెనుక అత్తగారు మూలుగులతో నడవలేక నడుస్తోంది ఆ వెనుక మా శ్రీమతి నిజంగా హంసగమన అనిపిస్తోంది

ఎట్టకేలకు స్వర్గాశ్రమం చేరుకుని అక్కడ ఒక గంటసేపు విడిసి, తిరిగి దిగువగా ఉన్న 'భరత్ మందిర్' సేవించుకున్నాము. ఒక చిన్న ఆలయంలో పరమశివునిపైన క్షీరాభిషేకం చేసి క్రిందకి దిగిపోయాము అపుడే నది దాటడానికి సిద్ధంగా ఉన్న నావ యెక్కబోయాము, త్వరలోనె విడిచి వేయబోతున్నారు ఇంతలో గట్టుమీద దూరంగా చేతులు సాచి పిలిచిన సంజ్ఞలు, ఒక మూగ చిత్రంలాగ అధరముల కదలిక కనిపించుతోంది, కాని కేకల ధ్వని వినిపించడంలేదు. నేను చూచాను ఆ పడవవారిని బ్రతిమాలి, కొంచెం నిలుపమన్నాను. వగర్చుకొంటూ వాళ్ళు వచ్చి ప్రవేశించారు. ఆ మేలిముసుగు వెనుక మిలమిలలాడుతూవున్న ఆ కన్నులు - కృతజ్ఞతా, అనుబంధం ఏవేవో అర్థంకాని బాధలు, తిరిగి మెరశాయి. పడవ సాగిపోయింది అద్దరికి చేరుకొన్నాం. మేము శివానంద ఆశ్రమంలో ఆ రాత్రికి ఉండిపోయాము.

రాత్రి – ప్రార్థనాసమయంలో ఏ భజన కీర్తనలు పాడినా, ఏ యుపదేశాలు విన్నా, ఏమి పనిచేసినా ఆ శహనాయ్ సంగీతం నా చెవులలో మారుమ్రోగు తూనేఉంది అదే రాగాలాపన; అదే ద్రుతగతీ–అవే తాన్‌స్వరాలు. జయజయ వంతి

మరునాడు మధ్యాహ్నం హృషీకేశం చేరుకున్నాము. అక్కడ కాళీ కమాలియావారి ఆసుపత్రి ఉన్నది. అత్త గారికి జ్వరం వచ్చింది. అక్కడ వైద్య శాలలో ఏవో మూలికల భస్మం ఇచ్చారు. అక్కడ తిరిగి ఆ సహయాత్రికులు కనిపించారు. ఆ సుందరి, వృద్ధ, ఆ యువకుడు. ఈసారి వృద్ధ చాల బాధగా శిరోవేదనతో బాధ పడిపోతున్నది. ఏవో మందు లిచ్చాడు. అదే కారులో అందరమూ కలిసి ప్రయాణం చేశాము.

తరువాత హరిద్వారంనుండి రైలు ప్రయాణము. అందులో తిరిగి అదే కుటుంబం. అవే అలసనేత్రాలలో అర్థంకాని ఆకాంక్షలు; అతృప్తమనోభిలాషలు; తీరని తీయనికోరికలు. ఈ జీవితమే ఒక–రైలు ప్రయాణం వంటిదేమో! ఎన్నో స్టేషన్లు; ఎన్నో మజిలీలు; ఎక్కేవాళ్ళు – దిగేవాళ్ళు; ఈ స్వల్ప వ్యవధిలో ఎన్నో పరిణామాలు, ఎన్నో బాంధవ్యాలు – ఇంతలో ఎవరు ఎవరికి ఉపకారం చేసినా మరొకరు ఋణపడి ఉండనక్కరలేదు.

'ఋణానుబంధ రూపేణ పతి పత్నీ సుతాదయః.'

ఆ క్షణంలో ఆ యువకుడు కృతజ్ఞత తెలియపరిచాడు. వచ్చీ రాని హిందీలో నేను ఏదో అన్నాను. ఏమీ మాటలాడకుండానే ఉండిపోయాను ఆమె మౌనంగా నిలిచిపోయింది. ఎవరి త్రోవను వాళ్ళం వెళ్ళిపోతున్నాం ఏమో చెప్పాలనుకొని చెప్పలేక పోయిన భావం – అంతలో ఆ యువకుడు చిన్న తాంబూలం అందుకున్నాడు. ఆమె మరొకటి తీసి అతని కందిచ్చింది అది ఆయన నాకు చిరునవ్వుతో ఇచ్చాడు దానితో క్షణంలో నా పెదవులు అరుణ రాగంతో మధురిమయ్యాయి. ఆ వృద్ధ స్త్రీ వద్ద మేము సెలవు తీసుకొన్నాము ఆ యువతి చిరునగవుపెదవులపైన అరుణరాగం తొణికిసలాడుతున్నది. ఆ కదలికలో పలుకని రాగస్వరాలు వినిపిస్తున్నవి. వానిలోని ప్రతిధ్వనులే–జయజయవంతి రాగస్వరాలు.

జయజయవంతి రాగం విన్నప్పుడల్ల ఆ దృశ్యాలు జ్ఞాపకం వస్తాయి. ఆ జ్ఞాపకాలలో సుందర నందనవనంలో అందమైన అప్సరసలు నృత్యం చేస్తారు వారి హావ భావ విలాసాలతో అణగారిన కోరికలూ అవ్యక్తమైన అభీప్సితాలు పైకి వస్తాయి.